ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us &
Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 71 | బుధవారం 12-03-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి

### బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు..



**హైదరాబాద్, మార్చి 11**
తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని ఎమ్మెల్యేలు, శాసన మండలి సభ్యులకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ శాసన సభ, మండలి సభ్యులందరూ నిర్ణీత సమయానికి సభకు హాజరుకావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై చీల్చి చెండాడాలన్నారు. బీఆర్ఎస్‌పై ప్రభుత్వం చేస్తున్న తప్పుడు నిందలను తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలు, ఎండిన పంటలు, అందని కరెంటు, అందని సాగునీరు, కాలిపోతున్న మోటర్లు తదితర రైతాంగ సమస్యలపై, మంచినీటి కొరతపై అసెంబ్లీలో, మండలిలో పోరాడాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలని.. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్న తీరుపై మాట్లాడాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు కొట్లాడాలన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలన్నారు. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు.. విడుదల చేయకపోవడం గురించి.. వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమస్యలపై ఎండగట్టాలన్నారు. దళిత బంధును నిలిపివేయడంపై ప్రశ్నించాలన్నారు. గొర్రెల పెంపకం, చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలని సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన దాదాపు మూడు గంటల పాటు ఎల్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రజల పక్షాన గట్టిగా పోరాడాలని సమావేశం నిర్ణయించింది. సభలో ఇంకా ప్రతిభావంతంగా ప్రజాసమస్యలపై పోరాడేందుకు సభ్యులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకునేందుకు డిప్యూటీ లీడర్లను నియమించనున్నట్లు కేసీఆర్ తెలిపారు. ఎల్పీ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభ సభ్యులు, మండలి సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్ఆర్ఆర్ పనులు 2 నెలల్లో..

**రెండున్నరేళ్లలో మామునూరు విమానాశ్రయం**

**కేంద్ర మంత్రులు గడ్కరీ, రామ్మోహన్ నాయుడు ఈ మేరకు హామీలు ఇచ్చారు**

**అనర్హత భయంతోనే అసెంబ్లీకి కేసీఆర్**

**బీఆర్ఎస్ ఇక గతమే.. మరో పదేళ్లు రేవంతే సీఎం ఢిల్లీలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి**



**న్యూఢిల్లీ, మార్చి 11:** రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)కు సంబంధించిన పెండింగ్ అంశాలను పూర్తిచేసి, పనులను ప్రారంభించేలా చూస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రులు నితిని గడ్కరీ, రామ్మోహన్ నాయుడులను వేర్వేరుగా కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. ఆయా పనులను వేగవంతం చేయాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ..భేటీల వివరాలను వెల్లడించారు. ఆర్ఆర్ఆర్‌కు కేంద్ర మంత్రివర్గ ఆమోదం లభించేలా చూడాలని గడ్కరీని కోరినట్లు వివరించారు. "ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి గత ఏడాది డిసెంబరు 27న రూ.7,100 కోట్లతో ఐదు ప్యాకేజీలుగా టెండర్లను పిలిచారు. అటవీ అనుమతులను వేగవంతం చేయాలని, ఆర్థిక త్రైపాక్షిక ఒప్పందంపై సంతకం చేయాలని గడ్కరీని కోరాం. చౌటుప్పల్-అమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి మీదుగా నిర్మిస్తున్న దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను ఖరారు చేయాలని విన్నవించాం" అని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

**హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్**

"హైదరాబాద్-శ్రీశైలం 187 కిలోమీటర్ల రహదారిలో అమ్రాబాద్ పులుల అభయారణ్యం మీదుగా 62 కిలోమీటర్ల ఎలివేటెడెట్ కారిడార్ నిర్మించాలి. అటవీ ప్రాంతం కావడంతో అనుమతుల్లేక ఈ ప్రాంతంలో అభివృద్ధి జరగలేదు. ఈ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలివేటెడ్ కారిడార్ సౌకర్యవంతంగా ఉంటుంది" అని గడ్కరీని కోమటిరెడ్డి కోరారు. ఎలివేటెడ్ కారిడార్‌తోపాటు.. సోమశిల కేబుల్ బ్రిడ్జికి టెండర్లను ఆహ్వానించేందుకు గడ్కరీ సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. "పర్వతమాల కింద తెలంగాణకు ఎటువంటి ప్రాజెక్టులు లేవు. ఈ నేపథ్యంలో.. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి రెండు కిలోమీటర్లు, భువనగిరి కోటకు కిలోమీటరు, నల్లగొండ పట్టణంలోని హనుమాన్ కొండకు రెండు కిలోమీటర్లు, నాగార్జునసాగర్ ఆనకట్ట మీదుగా నాగార్జునకొండను కలుపుతూ ఐదు కిలోమీటర్లు, మంథనిలోని రామగిరి కోటకు రెండు కిలోమీటర్ల రోప్‌వే ప్రాజెక్టులను మంజూరు చేయాలి" అంటూ కేంద్ర మంత్రికి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. సీఆర్ఐఎఫ-సేతుబంధు పథకం కింద రూ.887.45 కోట్ల విలువైన 12 రహదారి పనులను మంజూరు చేయాలని, దీనిపై గత ఏడాది జూన్ 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాశారని కోమట్‌రెడ్డి గుర్తుచేశారు. అవి పెండింగ్‌లోనే ఉన్నాయని, 2023-24 ఆర్థిక సంవత్సరంలో సేతుబంధన్ పథకం కింద ప్రతిపాదిత 12 ప్రాజెక్టులు మంజూరు చేయాలని గడ్కరీని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య కీలకమైన జాతీయ రహదారి ఎన్‌హెచ్-65పై ట్రాఫిక్ విపరీతంగా ఉందని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దానిని ఆరులేన్లుగా విస్తరించాలని కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనికి గడ్కరీ స్పందిస్తూ.. రెండు ప్యాకేజీలుగా మచిలీపట్నం వరకు ఈ రహదారిని విస్తరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయం మంజూరు చేయడంపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భూసేకరణ కోసం రూ.205 కోట్లను మంజూరు చేశామని వివరించారు. 15 రోజుల్లో భూసేకరణ పూర్తవుతుందని చెప్పారు. రెండున్నరేళ్లలో విమానాశ్రయాన్ని పూర్తిచేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని వెంకటరెడ్డి తెలిపారు.

**కేసీఆర్‌పై విమర్శలు**

మంత్రి కోమటిరెడ్డి విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. అనర్హత వేటు పడుతుందనే భయంతోనే కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రావాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అనేది గతం అని.. బ్రహ్మదేవుడు దిగి వచ్చినా.. ఆ పార్టీని కాపాడలేరన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తానని కేసీఆర్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. "కేసీఆర్ ఒక అంశాన్ని ఎత్తి చూపితే.. మేం పది అంశాలను సభ ముందు పెడతాం. దళిత ముఖ్యమంత్రి మొదలు.. ఎన్నో హామీలను కేసీఆర్ గంగలో కలిపేశారు. అసెంబ్లీలో వాటన్నింటినీ ఎండగడతాం" అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలవాలంటూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారని, ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అభ్యర్థులను నిలబెట్టకుండా.. బీజేపీకి ఓట్లు వేయించారని మండిపడ్డారు. సీఎం రేవంత్ నాయకత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని.. మరో పదేళ్లు ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సీఎం మార్పు అనేది అసత్య ప్రచారమన్నారు.


## కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్‌కు ఢిల్లీ కోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. మార్చి 18వ తేదీలోగా కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. కేజ్రీవాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు. దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళవారంనాడు ఢిల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' పదేళ్ల పాలనకు బీజేపీ గండికొడుతూ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో హోర్డింగ్‌ల పేరుతో ప్రజానిధుల దుర్వినియోగంపై కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## మోదీకి మారిషస్ అత్యున్నత పురస్కారం

**పోర్ట్ లూయిస్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ (%ఘీతీవఅఎతీ వీశీఎఱ%)కి మారిషస్ ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత పురస్కారం"ది గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అండ్ కీ ఆఫ్ ది ఇండియన్ ఓషన్" అందజేసింది. మారిషస్ ప్రధానమంత్రి నవీన్ రామ్‌గులం చేతుల మీదుగా మోదీ మంగళవారంనాడు ఈ పురస్కారం అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్న తొలి భారతీయుడు మోదీనే కావడం విశేషం. ఇండియా-మారిషస్ మధ్య సంబంధాల పటిష్ఠతకు చేసిన విశేష కృషికి గాను మోదీకి ఈ అవార్డును ప్రదానం చేశారు. దీంతో ఇంతవరకూ మోదీ అందుకున్న అంతర్జాతీయ పురస్కారాల సంఖ్య 21కి చేరింది. మారిషస్ నుంచి ఈ పురస్కారం అందుకున్న విదేశీయుల్లో మోదీ ఐదవ నేత అని ఈ సందర్భంగా నవీన్ రామ్‌గులం ప్రశంసించారు. తనకు మారిషస్ అత్యున్నత పౌర పురస్కారం అందజేయడంపై మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో వినమ్రంగా ఈ పురస్కారాన్ని తాను తీసుకుంటున్నానని, భారత్-మారిషస్ మధ్య చిరకాలంగా ఉన్న చారిత్రక బంధానికి దక్కిన గౌరవం ఇదని అన్నారు. దీనికి ముందు, మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ గోకుల్‌తో మోదీ



సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు, ఆయన సతీమణికి అరుదైన బహుమతులను మోదీ అందజేశారు. ప్రయాగ్‌రాజ్ ఇటీవల ముగిసిన మహా కుంభమేళా నుంచి తీసుకువెళ్లిన పవిత్ర గంగాజలాన్ని ధరమ్ గోకుల్‌కు అందించారు. వారణాసి నుంచి తీసుకువచ్చిన ప్రత్యేక బనారస్ చీరను హస్తకళాకారులు అందంగా తీర్చిదిద్దిన ఒక పెట్టెలో ఉంచి ధరమ్ గోకుల్ సతీమణి బృందా గోకుల్‌కు బహుకరించారు. అధ్యక్ష దంపతులకు ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డులను మోదీ అందజేశారు. మారిషస్ స్వతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు మోదీ మంగళవారంనాడు ఇక్కడకు విచ్చేశారు.

## రైలు హైజాక్.. బందీలుగా వందలాది ప్రయాణికులు



బలోచిస్థాన్‌లోని క్వెట్టా నుంచి ఖారబర్ పఖ్తుంఖ్వాలోని పెషావర్‌కు సుమారు 400 మంది ప్రయాణికులతో జాఫర్ ఎక్స్‌ప్రెస్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటన వివరాల ప్రకారం ఉగ్రవాద సంస్థ రైల్వేట్రాక్‌ను పేల్చేయడంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. వెంటనే మిలిటెంట్లు రైలును తమ అధీనంలోకి తెచ్చుకుని ప్రయాణికులను బంధించారు. ఆరుగురు ఆర్మీ సిబ్బందిని కాల్చిచంపినట్టు, 120 మంది ప్రయాణికులను బందీలుగా తీసుకున్న బీఎల్ఏ ప్రకటించింది. తమపై మిలటరీ చర్యలకు దిగితే తీవ్ర పరిణామాలు తప్పని, బందీలందరినీ చంపేస్తామని హెచ్చరించింది. కాగా, సమాచారం తెలియగానే తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. భద్రతా బలగాలు ఘటనా స్థలానికి చేరుకున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఎమర్జెన్సీ చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ ప్రతినిధి ఒకరు తెలిపారు. బలోచ్ ప్రజల

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో వేర్పాటువాదులు విరుచుకుపడ్డారు. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని ప్రయాణికుల రైలుపై కాల్పులతో దాడి చేశారు. రైలు ఆగగానే వందలాది మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకున్నారు. ఈ దాడిలో ఆరుగురు మిలటరీ సిబ్బందిని ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి తామే పాల్పడినట్టు వేర్పాటువాద మిలిటెంట్ సంస్థ బలోచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది.

స్వయం నిర్ణయాధికారం, పాకిస్థాన్ నుంచి ప్రత్యేక ప్రాంత ఆవిర్భావం డిమాండ్‌తో 2000లో బీఎల్ఏ ఏర్పడింది. అప్పట్నించీ పలు హింసాత్మక దాడులకు పాల్పడటంతో ఆ సంస్థను పాక్, అమెరికా, యూకేలు ఉగ్రవాద సంస్థగా ప్రకటించాయి.

## గ్రూప్-2 ఫలితాలను విడుదల చేసిన టీజీపీఎస్సీ




**హైదరాబాద్:**
ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితాలు మంగళవారం సాయంత్రం విడుదలయ్యాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 783 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలకాగా, 5 లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పరీక్షలకు 46 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే సగానికి సగం మంది మాత్రమే గ్రూప్-2 పరీక్షలను రాశారు. 2024 డిసెంబర్ 15, 16న పరీక్షలు నిర్వహించారు.

## నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం

**ఒక్కొక్కరికి రూ.3 లక్షల ఆర్థిక సాయం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా 5 లక్షల మందికి వర్తింపు**

**కొత్త పథకాన్ని ప్రకటించిన ప్రభుత్వం**

**డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి.. గత సర్కారు యువతను విస్మరించిందని విమర్శ**

**హైదరాబాద్, మార్చి 11:** నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువత కోసం 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా 5 లక్షల మంది యువతకు ఈ పథకం కింద స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తామని వెల్లడించారు. చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ సర్కారు నిరుద్యోగ యువతను పూర్తిగా విస్మరించిందన్నారు. కార్పొరేషన్లకు నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే యువతకు స్వయం ఉపాధి పథకాలను అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖలు సీఎం వద్ద, బీసీ సంక్షేమ శాఖ పొన్నం ప్రభాకర్ వద్ద ఉన్నాయని తెలిపారు. యువతకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో వారు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారన్నారు. ఇప్పటికే టీజీపీఎస్సీ ద్వారా ఉద్యోగాలను భర్తీ చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని, ఇంకా మిగిలిపోయిన వారికి స్వయం ఉపాధి పథకాలను అందించాలని నిర్ణయించామని చెప్పారు. అందులో భాగంగానే రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకం కిందో ఒక్కో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగికి రూ.3 లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. రాష్ట్రంలోని 5 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఈ సాయం అందిస్తామని చెప్పారు. ఇందుకోసం రూ.6000 కోట్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఒక్కొక్కరికి అందించే ఆర్థిక సహాయంలో బ్యాంకు లింకేజీ ఉంటుందన్నారు. రూ.3 లక్షలు పూర్తిగా సబ్సిడీనా? బ్యాంకు రుణమా? ఎంత శాతం సబ్సిడీ? అనే వివరాలను త్వరలో వెల్లడిస్తామని భట్టి చెప్పారు. విధివిధానాలు, లబ్ధిదారుల అర్హతలు వంటి వివరాలను కూడా ప్రకటిస్తామన్నారు. లబ్ధిదారుల వయసు 55 ఏళ్లకు మించి ఉండరాదని తెలిపారు. పథకానికి సంబంధించి ఈ నెల 15న నోటిఫికేషన్ జారీ చేస్తామని, ఏప్రిల్ 5 వరకు నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు.

# వేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**తొర్రూరు తొలి సమయం మార్చి 11**
తొర్రూరు మండల కేంద్రంలోని రెడ్డి గార్డెన్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు వేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేట ఫౌండర్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో గొప్ప ప్రగతి సాధించిన మహిళలను సన్మానించడం ద్వారా సమాజంలో మహిళా సాధికారత, వారి కృషికి గౌరవం తెలియజేశారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు వేట ఫౌండర్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మహిళా మణులను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..మహిళలు ఈ సమాజానికి నిలువెత్తు ప్రేరణ పురుషుల కంటే తక్కువ కాకుండా, అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. ప్రతి మహిళ తన లక్ష్యాలను సాధించేందుకు ధైర్యంగా ముందుకెళ్లాలి, ఎలాంటి అడ్డంకులైనా ఎదుర్కొని, విజయాన్ని సాధించగలరని సూచించారు. సంస్కరణలకు తోడ్పాటు-సమాజంలో మహిళల భద్రత, ఆర్థిక స్వావలంబన, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో మరిన్ని సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మహిళా సాధికారత అనేది కుటుంబాల అభివృద్ధికి పునాది - మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ముందుకు సాగితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.. ఈ సందర్భంగా వేట ఫౌండర్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ వేడుకను మహిళల ప్రగతికి అంకితం చేస్తూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని కోరారు. వేట ఫౌండేషన్ మహిళల అభివృద్ధికి కృషి చేస్తుంది -వారి శిక్షణ, ఉపాధి అవకాశాలు, మద్దతు వంటి సేవలు అందిస్తామని తెలిపారు. సమాజంలో మార్పు రావాలంటే మహిళల భాగస్వామ్యం పెరగాలి-అందుకు కుటుంబం, సమాజం అందరూ సహకరించాలని కోరారు. భవిష్యత్తులో మహిళలకు మరింత సహాయం చేయడానికి వేట ఫౌండేషన్ సిద్ధంగా ఉంది - మహిళా సాధికారత కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు.. సన్మానిత మహిళా మణుల మాట్లాడుతూ.వైద్య, విద్య, క్రీడా, రాజకీయ, సేవా రంగాల్లో గుర్తింపు పొందిన మహిళలు తమ అనుభవాలను పంచుకున్నారు. సమాజంలో మహిళలకు మరింత ప్రోత్సాహం అవసరం -పురుషులతో సమానంగా అవకాశాలు దొరకాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరింత మద్దతు ఇవ్వాలి - స్వయం ఉపాధి, స్టార్ట్-అప్‌లు, వృత్తిపరమైన శిక్షణలో సహాయం చేయాలని కోరారు. ఇప్పటికే విజయాలు సాధించిన మహిళలు యువతకు మార్గదర్శకంగా ఉండాలి-తద్వారా మరెందరో స్త్రీలు ముందుకు రావచ్చని చెప్పారు.ఈ వేడుకలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, వేట సభ్యులు, మహిళా సంఘాల నాయకులు, విద్యార్థినులు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. మహిళా దినోత్సవాన్ని విజయవంతంగా జరిపినందుకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు వేట ఫౌండర్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎల్,ఆర్,ఎస్ ప్రజలందరూ సద్వినియోగపరుచుకోవాలి

**మర్చి 31 నాటికి భూ క్రమబద్ధీకరణ కు ప్రభుత్వం కల్పించిన**

**ఎల్. ఆర్. ఎస్ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**






**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 11**
మార్చి 31 నాటికి భూ క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన ఎల్. ఆర్.ఎస్ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. ఎల్.ఆర్. ఎస్ పై అవగాహన కల్పించేందుకు మంగళవారం ఐ డి ఓ సి కార్యాలయ సమావేశ మందిరంలో టౌన్ ప్లానర్ లు, లే అవుట్ రైటర్ లు, బిల్డర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. 2020 తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్ లు తీసుకున్నవారు జిల్లాలో 5488 మంది ఎల్. ఆర్.ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఇప్పుడు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు కేవలం 400 మంది మాత్రమే ముందుకు వచ్చి డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల ద్వారా నోటీస్ లు జారీ చేసినప్పటికీ ఫోన్ నెంబర్లలో తేడాలు, చిరునామాల్లో తేడాలు ఉండటం వల్ల అవి ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారికి చేరడం లేదన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో 2112 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని ఆయన తెలిపారు. లే అవుట్ లు చేసిన వారు, ఓనర్లు, రైటర్ లు, బిల్డర్లు ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి సమాచారం, అవగాహన కల్పించి సకాలంలో ఎల్.ఆర్.ఎస్. చేయించుకునే విధంగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవగాహన లేకపోవడం లేదా సమాచారం లేకపోవడం వల్ల సద్వినియోగం చేసుకోకుంటే రేపటినాడు ఎప్పుడైనా ఎల్. ఆర్.ఎస్ ఆమోదం లేని ప్లాటు పై ఇల్లు కట్టుకోవాలంటే అప్పటి ప్లాట్ వాల్యూ పై ప్రో రేటా ఫీజు తో పాటు 14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. నిషేధిత స్థలం లేదా చెరువు, కుంట కింద లేకుంటే ప్లాటు యజమాని ఫోన్ కు నేరుగా ఎంత డబ్బులు కట్టాలో సమాచారం వెళుతుందన్నారు. ఏదేని కారణం చేత ఎల్.ఆర్.ఎస్. ఎల్.ఆర్.ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించుకోడానికి అవకాశం ఉండదని అదేవిధంగా లే అవుట్ ప్లాట్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీ ద్వారా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్.ఆర్ ఎస్ ఉన్న ప్లాటు కు మంచి డిమాండు ఉంటుందని తెలియజేశారు. బిల్డర్లు, లే అవుట్ ప్లానర్ లు ప్లాటు యజమానులతో సంప్రదించి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలని కోరారు.ఈ సమావేశంలో సబ్ రిజిస్టర్ వేణుమాధవ్, కొత్తగూడెం, పాల్వంచ టౌన్ ప్లానింగ్ ఇంజినీర్ లు, బిల్డర్లు లేఔట్ ప్లానర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి బాధ్యతగా కృషి చేయాలి

**జిల్లాలోని కోర్టు డ్యూటీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**





**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 11**
కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని కోర్టు డ్యూటీ అధికారులతో ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పలు పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న కేసులు వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.కేసులు పెండింగ్ ఉండడానికి గల కారణాలను తెలుసుకున్నారు.ఎప్పటికప్పుడు కేసుల పురోగతి వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తూ కేసులలోని ప్రతి విషయాన్ని ఆన్లైన్లో నిక్షిప్తం చేయాలని సమావేశంలో పాల్గొన్న కోర్టు డ్యూటీ అధికారులకు తెలియజేసారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణా చర్యలు ఖచ్చితంగా తీసుకుంటామని హెచ్చరించారు.%చీదీఔ% (నాన్ బెయిలబుల్ వారెంట్స్) జారీ విషయంలో అలసత్వం వహించచకుండా వ్యవహరించాలని సూచించారు.నేరస్థులకు శిక్ష పడే విధంగా కృషి చేసి కన్విక్షన్ రేటును పెంచాలని కోరారు.ఏవైనా సందేహాలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల సలహాలు సూచనలతో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి,ఎస్సైలు హారిక,హసీనా మరియు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# హౌసింగ్ బోర్డు కమిటీ అధ్యక్షులుగా కట్లవెంకన్న ఎన్నిక..

**తొలి సమయం, మహబూబాబాద్ మార్చి 11:**





జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ కమిటీ కి కట్ల వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, ప్రధాన కార్యదర్శిగా గార్లపాటి జైపాల్ రెడ్డి, కోశాధికారి భానోత్ ఖాసీం ఎన్నికయ్యారు ఈ సందర్భంగా కట్ల వెంకన్న మాట్లాడుతూ నాపై విశ్వాసముంచి, నన్ను ఏకగ్రీవంగా ఎన్నికకు సహకరించిన కాలనీ వాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ సభ్యులందరికీ కలుపుకొని కాలనీ అభివృద్ధికి తోడ్పడతానని అన్నారు. ఆదర్శ కాలనీ గా తీర్చి దిద్దడం కోసం శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తానని అన్నారు.

# సిసి రోడ్డు శంకుస్థాపన

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్**



**తొలి సమయం దంతాలపల్లి మార్చి 11**
దంతాలపల్లి మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ నుండి ఎల్లు సంజీవరెడ్డి ఇంటి వరకు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా సిసి రోడ్డు శంకుస్థాపన లిఏఎంసీ తోరూర్ వైస్ చైర్మన్ దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు పట్టు నాయక్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తొర్రూర్ ఏఎంసి డైరెక్టర్ కొమ్ము వాసు. మండల నాయకులు.మాజీ ఎంపిటిసి నెమ్మది యాకన్న. సుతరపు కృష్ణయ్య.సాయి.డాక్టర్ వెంకటేశ్వర్లు.వెంకట్ రెడ్డి.నెహ్రూ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీరు పై సమీక్ష సమావేశం



**తొలి సమయం తొర్రూరు మార్చి 11**
పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కార్యాలయం (ఆర్డబ్ల్యూఎస్) అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళికలు -మండలాల్లో ఎక్కడైనా నీటి ఎద్దడిని అంచనా వేసి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. విఆర్ఎస్ పనులను వేగంగా పూర్తి చేయాలి- ఇప్పటికే చేపట్టిన గ్రామీణ నీరు సరఫరా పథకాలను వేగంగా పూర్తిచేసి, వాటి అమలులో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. పరిశుభ్రత మరియు నీటి నాణ్యత ప్రజలకు అందించే తాగునీరు పూర్తి పరిశుభ్రమైనదై ఉండాలని, నీటి నాణ్యతను నిరంతరం తనిఖీ చేయించాలని అధికారులను ఆదేశించారు. అడుగడుగునా పర్యవేక్షణ- వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని, తక్షణ చర్యలు తీసుకునేలా నియంత్రణ విధానాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లాల నీటి సరఫరా శాఖ అధికారులు, ఇంజనీర్లు, గ్రామ మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అమెరికాలోనే పేపాల్ డాటా లీకేజీ!

**గుజరాత్ కేసుకు మాదాపూర్‌తో లింకుందా?**

**హైదరాబాద్, మార్చి 11:** దిగ్గజ పేమెంట్ గేట్‌వే పేపాల్ వినియోగదారుల డాటా లీకేజీ అమెరికాలోనే జరిగినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) గుర్తించింది. దుబాయ్‌లో ఉంటున్న కైవన్ పటేల్ రూపేశ్‌కుమార్ అలియాస్ జాదూభాయ్. అతని సోదరుడు విక్కీకి ఈ సమాచారం అమెరికా నుంచే చేరిందని నిర్ధారించింది. జాదూభాయ్ ద్వారా ఆ సమాచారాన్ని సేకరించిన గుజరాత్‌కు చెందిన ఆజాద్ అనే కేటుగాడు.. మాదాపూర్‌లో కాల్‌సెంటర్ నిర్వహించే మనస్వినికి ఆ వివరాలను అందించినట్లు తేల్చారు. సీఎస్‌బీ ఈ మేరకు అమెరికా ఎంబసీకి వివరాలను అందజేసింది. డాటా ఫ్రాడ్ ద్వారా సైబర్ నేరగాళ్లు అమెరికాకు చెందిన పేపాల్ ఖాతాదారుల సమాచారాన్ని కొల్లగొట్టినట్లు వివరించింది.

# నకిలీ డిఎస్‌పిని అని చెప్పుకునే అతన్ని అరెస్ట్ చేసిన పోలీసులు

**ఉద్యోగాలు ఇప్పిస్థానని అమయాక యువత నుండి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ డిఎస్‌పి**

**అరెస్ట్ చేసి 18 లక్షల నగదు, ఒక కారు, పోలీస్ యూనిఫాం, 2 డమ్మీ మ్యాన్ ప్యాక్ లు స్వాధీనం**



**సూర్యాపేట, మార్చి 11**

సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం నందు మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ కే నరసింహ ఐపీఎస్ మంగళవారం రోజున ఉదయం శ్రీ గ్రాండ్ హోటల్ నందు ఒక వ్యక్తి అనుమానాస్పదంగా ఉన్నాడు అనే హోటల్ యాజమాన్యం ఇచ్చిన సమాచారం పై వెంటనే శ్రీ గ్రాండ్ హోటల్ కి వెళ్ళి అక్కడ ఉన్న వ్యక్తిని అదుపు లోకి తీసుకొని బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అతనిని విచారించగా అతని పేరు బతుల శ్రీనివాస్ రావు 35 సం,,లు, నివాసం: మట్టపల్లి గ్రామం, మటంపల్లి మండలం అని తెలుపుతూ తనను తాను డి ఎస్ పి గా పరిచయం చేసుకొని అమాయకమైన నిరుద్యోగులకు పోలీస్ డిపార్ట్మెంట్‌లో, సివిల్ సప్లయ్ లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వారి వద్ద డబ్బులు తీసుకొని జల్సాలకు ఖర్చు పెట్టుకుంటాడు , గతంలో ఇతని పై మటంపల్లి, రాజముండ్రి 2 టౌన్, నర్సరావపేట రూరల్, త్రిపురాంతకం, మెడికొండూర్ మార్కాపురం లలో 2022 ఇదే విధంగా మోసం చేయడం తో కేసులు అయినవి జైల్ కి వెళ్ళి బెయిలు పై వచ్చి సెప్టెంబర్ -2024 నుండి మరలా కొంత మందిని ఆటో డ్రైవరు ల ద్వారా, మంగలి షాపుల ద్వారా కొంత మందికి డి ఎస్ పి గా పరిచయం చేసుకుంటాడు. అదే విధంగా కోదాడ లో ఒక అమ్మాయికి ఎస్సై ఉద్యోగం ఇప్పిస్తానని ఆమె వద్ద రూ. 36,00,000/- (ముప్పై ఆరు లక్షలు), ఆంధ్రప్రదేశ్ లోని మార్టూరు కి చెందిన వ్యక్తి వద్ద కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని అతని వద్ద కొంత గురజాల కి చెందిన వ్యక్తి వద్ద జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు లు తీసుకొని తన జల్సాలకు ఖర్చు చేసుకోగా కోదాడ కి చెందిన అమ్మాయి ఎస్సై ఉద్యోగం కోసం ఇచ్చిన డబ్బులలో మిగిలిన డబ్బులు రూ. 18,00,000/-( పద్దెనిమిది లక్షలు )అతని వద్ద నుండి రికవరీ చేసి అతనిని రిమాండ్ కి పంపబడునని తెలిపారు. ఈ కేసును ఛేదించడం లో ప్రతిభ కనబరిచిన పి.. వి రాఘవులు సర్కిల్ ఇన్స్పెక్టర్ కానిస్టేబుల్ లు సిబ్బంది ని అభినదించారు.

# దేశవ్యాప్తంగా శ్రీ చైతన్య కాలేజీలపై రెండో రోజు ఐటి సోదాలు




**సూర్యాపేట, మార్చి 11**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలలోనూ ఐటీ శాఖ బృందాలు శ్రీ చైతన్య కాలేజీలపై సోదాలు చేపట్టాయి. ఈ సోదాలు రెండో రోజు కూడా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలపై ప్రస్తుతం పెద్ద ఎత్తున ఐటీ శాఖ సోదాలు చేస్తోంది. విద్యార్థుల నుంచి భారీగా నగదు తీసుకోవడం, అవే నగదును టాక్స్ చెల్లించకుండా మళ్లీ అంగీకరించుకోవడం వంటి అక్రమ లావాదేవీలను శ్రీ చైతన్య సంస్థలు నిర్వహిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. సోదాలు చేపట్టిన ఐటీ శాఖ అధికారులు ఈ వివాదంలో ఉన్న పన్ను చెల్లింపుల్ని, వ్యవహారాల్ని పూర్తిగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి నగదు రూపంలో డబ్బులను తీసుకొని, పన్ను ఎగవేత చేస్తున్నాయని సమాచారం అందిన తరువాత ఈ సోదాలు చేపట్టాం. అలాగే, ఈ సంస్థలు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా లావాదేవీలు నిర్వహించడమేకాకుండా, మరో సాఫ్ట్‌వేర్ ద్వారా టాక్స్ చెల్లింపులనూ తప్పించుకుంటున్నాయని అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల కాలంలో, శ్రీ చైతన్య విద్యాసంస్థలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యంత ప్రముఖంగా ఉన్న విద్యా సంస్థలుగా అవతరించాయి. ఈ సంస్థ విద్యార్థుల కోసం రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఒకటి, విద్యార్థుల ఫీజులు, ఇతర చెల్లింపులను నిర్దేశించిన విధంగా సులభంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుంది. కానీ, ఇక్కడే కొత్త సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఆ సాఫ్ట్‌వేర్ ద్వారా విద్యార్థుల నుంచి నగదు రూపంలో డబ్బులు తీసుకోవడం, అవసంమైన విధంగా పన్నులు చెల్లించకుండా వ్యవహరించడం జరిగిందని తెలిసింది. అధికారుల ప్రకారం ఈ సంస్థ విద్యార్థుల నుంచి తీసుకున్న నగదు మొత్తం, పన్ను చెల్లించకుండా బయటికి మళ్లిస్తున్నట్లు గుర్తించారు. కొంతకాలంగా అలాంటి అక్రమ లావాదేవీలపై ఐటీ శాఖకు సమాచారం అందింది. మరో విషయం కూడా బయట పడింది. ఐటీ శాఖ అధికారుల ప్రకారం, ఈ సంస్థ మరొక సాఫ్ట్‌వేర్ కూడా ఉపయోగించి, తమ పన్ను చెల్లింపులను మరొక విధంగా మార్చుకునే ప్రయత్నం చేసినట్లు గుర్తించారు. పన్నుల బకాయిలను సాఫ్ట్‌వేర్ ద్వారా సులభంగా దాచడానికి మార్పులు చేసేందుకు ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోగించారని అంటున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతంలో ఉన్న శ్రీ చైతన్య కాలేజ్ హెడ్ క్వార్టర్స్‌లో తనిఖీలు చేశారు. ఈ కార్యాలయాన్ని సోదాలు చేసే క్రమంలో ఐటీ అధికారులు అక్కడ మరింత సమాచారం సేకరించడానికి పెద్ద ఎత్తున రహస్య విచారణలు చేపట్టారు. అందుబాటులో ఉన్న డాక్యుమెంట్లను కూడా పరిశీలించటానికి ఐటీ బృందం ప్రయత్నిస్తోంది. పన్ను చెల్లింపుల సమాచారాన్ని, అక్రమ లావాదేవీలను ఛేదించడానికి పెద్ద ఎత్తున సోదాలు నిర్వహిస్తున్నాయి. గతంలో కొన్నిసార్లు ఈ విద్యాసంస్థలపై వేర్వేరు ఆరోపణలు వచ్చినప్పటికీ, ఈసారి ఐటీ శాఖ చేపట్టిన సోదాలు మరింత ఉత్కంఠగా మారాయి. గతంలో కూడా వివిధ కాలేజీలపై ఐటీ శాఖ, పన్ను శాఖ క్రమంగా విచారణలు చేపట్టింది.

# ఎంఆర్‌పిస్ ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు

**కమలాపూర్,మార్చి 11**

హుజురాబాద్ నియోజకవర్గంకమలాపూర్ మండల కేంద్రంలోని మంగళవారం రోజున పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కమలాపూర్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు మండల అధ్యక్షులు ముత్యాల రమేష్ మాదిగ ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు మాదిగ హాజరై రిలే దీక్ష ను ప్రారంభించారు. అనంతరం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు చిలువేరు సంపత్ మాదిగమాట్లాడుతు వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే నిండు అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ వెంటనే అమలు చేస్తామని చరిత్రలోనే వర్గీకరణ చేసిన తొలి ముఖ్యమంత్రిగా ఉంటానని, అవసరమైతే



ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వ ఉద్యోగాలను పూర్తి చేస్తానని మాట ఇచ్చిన రేవంత్ రెడ్డి.. ఆ మాట నిలబెట్టుకోవాలని,ఎస్సీ లా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి, అమలు చేసే వరకు అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియమకాలు నిలిపివేయాలని.త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తీర్ణంలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని, డిమాండ్ చేస్తూ ఈరోజు రిలే దీక్షలు ప్రారంభించడం జరిగిందిఅని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగల సహనాన్ని పరీక్షించొద్దని రాబోయే రోజులలో మాదిగలు తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు.రిలే దీక్షల కార్యక్రమంలో కమలాపూర్ మండల ఉపాధ్యక్షులు ఇసంపెల్లి రమేష్ మాదిగ, మండల కార్యదర్శి ఇసంపెల్లి రాజు కుమార్ మాదిగ,వి హె పి మండల నాయకులు శనిగరపు జనార్ధన్ మాదిగ, నాయకులు ఇసం పెల్లి ఐలయ్య మాదిగ,అల్లకొండ శంకర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# అందంగా ఉందని ప్రియురాలిని చంపేశాడు..

**లక్నో, మార్చి 11:** తన స్నేహితురాలు అందంగా ఉన్నానని గర్వంగా భావిస్తుందని.. అలాగే తనతో నమ్మకంగా స్నేహం చేయడం లేదంటూ 17 ఏళ్ల యువతిని శివం వర్మ అనే యువకుడు గొంతు కోసి అత్యంత పాశవికంగా హత్య చేశాడు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. అనంతరం మృతురాలి స్నేహితురాలకి హంతకుడు ఫోన్ చేసి.. అందంగా ఉన్నానని మీ స్నేహితురాలు గర్వంగా ఫీలవుతుందంటూ ఫోన్ కట్ చేశాడు. ఈ నేపథ్యంలో జరిగిన విషయాన్ని మృతురాలి తండ్రికి ఆమె తెలియజేసింది. ఆయన హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే యువతి రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉంది. ఆ వెంటనే ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. యువతి మృతదేహాన్ని పోస్ట్ మార్టంకు తరలించేందుకు సిద్ధమయ్యారు. అయితే మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆమె తరఫు బంధువులు ఆందోళనకు దిగారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేస్తామంటూ వారికి నచ్చ చెప్పడంతో.. దాదాపు రెండు గంటల అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ హత్యపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు హంతకుడు శివం వర్మను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక తమ విచారణలో శివం వర్మ చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు.మరోవైపు నిందితుడు తమ ఇంటి వద్ద అద్దెకు ఉండేవారని మృతురాలి తండ్రి పోలీసులకు వెల్లడించారు. అతని ప్రవర్తన సరిగ్గా ఉండేది కాదని వివరించారు. ఈ కేసులో తన కుమార్తెకు న్యాయం చేయాలని మృతురాలి తండ్రి పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

# అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా రమేష్ నియామకం

**కరీంనగర్,మార్చి 11**



కరీంనగర్ బార్ అసోసియేషన్ కు చెందిన సీనియర్ న్యాయవాది చామనపెల్లి రమేష్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ జిల్లా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిలు కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా నియ మిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్ తిరుపతి, సెక్రటరీ టూ గవర్నమెంట్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామడుగు మండలంలోని చామనపెల్లి గ్రామానికీ చెందిన రమేష్ 2004 లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించి పలు సివిల్, క్రిమినల్ కేసులు వాదించారు. ఈయన మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వం తరపున నమోదైన పలు సివిల్ కేసులను వాదించనున్నారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మనకొండూర్ ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా నియామకమైన రమేష్ ని కరీంనగర్ బార్ అసోసియేషన్ అద్యక్షులు పివి రాజ్ కుమార్, కాంగ్రెస్ లీగల్ సెల్ బాధ్యులు కల్లేపల్లి లక్ష్మయ్య, కొత్త ప్రకాశ్, సీనియర్ న్యాయవాదులు గడ్డం లక్ష్మణ్, కొరివి వేణు గోపాల్, ఎర్రం రాజి రెడ్డి, వివి రమణ రావు, పెంచాల మురహరి రావు లు అభినందించారు.

# సెకండరీ ట్రాన్స్ఫర్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్

**ద్వితీయ ట్రాన్స్ఫర్ స్టేషన్ లో యంత్రాల పనితీరు పరిశీలన**





**వరంగల్, మార్చి 11**

హన్మకొండ లోని బాలసముద్రం లోని వెహికల్ షెడ్‌లో గల సెకండరీ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే మంగళవారం క్షేత్ర స్థాయి లో ఆకస్మికంగా తనిఖీ చేసి ట్రాన్స్ఫర్ స్టేషన్ లో గల యంత్రాల పనితీరు ను పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా సెకండ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ఏజెన్సీ ప్రతినిధుల తో చెత్త నిర్వహణ తీరు గురుంచి అడిగి తెలుసుకొంటూ యంత్రాలలో ఎంత పరిమాణంలో చెత్తను వేస్తున్నారు? ప్రతి రోజు ఎన్ని ఆటోలు స్టేషన్ కు వస్తున్నాయా వాహనాలకు సంబంధించిన లాగ్ బుక్కులు నిర్వహిస్తున్నారా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.సి ఏంహెచ్ఓను ఆదేశిస్తూ ఏజెన్సీ వారు ఖచ్చితంగా విధులు నిర్వహించేలా చూడాలని ఏజెన్సీకి చెందిన కంప్రెసర్ వాహనాలు కచ్చితంగా మూడు ట్రిప్పులు వేయాలని ట్రాన్స్ఫర్ స్టేషన్ కు ఎంత పరిమాణంలో తడి పొడి చెత్త వస్తుందని? తడి చెత్తను ఎక్కడ కంపోస్టు ఎరువుగా మార్చుతున్నారని కంపోస్టు ఎరువు పరిమాణాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలని డి ఆర్ సి సి కేంద్రాలలో పొడి చెత్త పెరిగేలా చర్యలు తీసుకోవాలని వాహనాల మరమ్మత్తుల కోసం షెడ్ కు వచ్చే వాహనాలను జాప్యం లేకుండా మరమ్మత్తులు పూర్తి చేసి పంపించాలని కమిషనర్ అన్నారు.ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి ఎంహెచ్ఓ డా. రాజేష్, ఈ ఈ మహేందర్,డి ఈ శివానంద్, సానిటరీ సూపర్వైజర్ నరేందర్,ఏ ఈ సంతోష్, సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ ఏజెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# పింఛను కోసం తండ్రిని గెంటేసిన పిల్లలు

**కమలాపూర్, మార్చి 11**



దారుణం పింఛను కోసం తండ్రిని గెంటేసిన పిల్లలు హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో సొంత పిల్లలు అమానుషానికి పాల్పడ్డారు. పిల్లల నారాయణ అనే రిటైర్డ్ టీచర్ తన పిల్లలు వేధిస్తున్నారని ప్రజావాణిలో ఆవేదన వ్యక్తం చేశారు. తన 16 ఎకరాల భూమిని అందరికీ సమానంగా పంచానని, ప్రస్తుతం పెన్షనుతో బ్రతుకుతున్నానని చెప్పారు. పెన్షన్ కోసం పిల్లలు వేధిస్తూ ఇంటినుంచి వెళ్లగొట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నానని, వారి వేధింపుల నుంచి కాపాడాలని కోరారు.

# సత్తుపల్లి మండలంలో అంతర్ రాష్ట దొంగ బీభత్సం

**సత్తుపల్లి, మార్చి 11**



మంగళవారం నాడు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఐడి పార్టీ కానిస్టేబుల్ నరేష్ పై నాలుగు చోట్ల కత్తి దాడి చేసి పరరైనా అయిన అంతర్ రాష్ట్ర దొంగ. కానిస్టేబుల్ నరేష్ కు తల భాగంలో రెండు పోట్లు, భుజం భాగంలో రెండు పోట్లు పొడిచిన అంతర్ రాష్ట్ర దొంగ.ఆస్పత్రికి తరలించిన పోలీసులు.చికిత్స అందిస్తున్న వైద్యులు సత్తుపల్లి బస్టాండ్ లో అంతర్ రాష్ట దొంగ అనుమాన స్పదంగా ఉండటంతో గుర్తించిన ఐడి పార్టీ కానిస్టేబుల్.ఐడి పార్టీ కానిస్టేబుల్ ను చూసి బైక్ పై పరారు అయిన అంతర్ రాష్ట దొంగ.అంతర్ రాష్ట దొంగను వెంబడించి సత్తుపల్లి శివారు లో అడ్డగించిన ఐడి పార్టీ కానిస్టేబుల్.అడ్డగించిన ఐడి పార్టీ కానిస్టేబుల్ నరేష్ పై కత్తితో దాడి చేసి పరారు అయిన అంతర్ రాష్ట్ర దొంగ.పరారు అయిన అంతర్ రాష్ట్ర దొంగ సురేంధర్ ఎన్ టి ఆర్ జిల్లా చాత్రాయి గ్రామానికి చెందిన వాడిగా గుర్తింపు.

# అమెరికాను యూరప్ ధిక్కరించగలదా?

**అమెరికా :** వైట్ హౌజ్‌లో అమెరికా అధ్యక్షుడు చర్చలకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడిని అవమానించిన రోజున (28, ఫిబ్రవరి) నేను ప్రముఖ సాహిత్య పత్రిక గ్రంట పాత సంచిక నొకదాన్ని చదువుతున్నాను. 1990 వసంతకాలంలో ప్రచురితమైన ఆ సంచిక ఇతివృత్తం 'కొత్త యూరప్!'. కొత్త అనే విశేషణం, ఆశ్చర్యార్థ సూచకం రెండూ కిందటి సంవత్సరం (1989)లో సంభవించిన చరిత్రాత్మక ఘటనలకు అంగీకారం తెలుపుతున్నవే. బెర్లిన్ గోడ పతనం, దశాబ్దాల అనంతరం పోలండ్లో ప్రప్రథమంగా స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగడం, తూర్పు యూరోపియన్ దేశాలలో నియంతృత్వ వ్యవస్థలు కుప్ప కూలిపోవడం మొదలైన నవ యుగ నిర్మాణ పరిణామాలు ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన సందర్భమది. ఆ సంఘటనలు యూరప్ భవిష్యత్తును ఏ విధంగా ప్రభావితం చేయనున్నాయనే విషయమై గ్రంట ఎడిటర్ విఖ్యాత యూరోపియన్ రచయితలు, మేధావుల నుంచి వ్యాసాలను ఆహ్వానించాడు. సహజంగానే ఆ వ్యాసకర్తలలో చాలా మంది గత కొద్ది నెలలుగా యూరప్‌లో చోటు చేసుకుంటున్న ఘటనల పట్ల తమ ఎనలేని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వారిలో ఒకరైన తూర్పు జర్మనీ మత గురువు వెర్నర్ క్రాట్ షెల్ బెర్లిన్ గోడ పతనానికి దారితీసిన 'స్వేచ్ఛ, గౌరవం కోసం పోరాటం'కు అభివందనాలు తెలిపారు. గ్రంట వ్యాస రచయితలలో ఒకరు రాజనీతి శాస్త్రవేత్త ఇసయ్యా బెర్లిన్. పాశ్చాత్య మేథో ప్రపంచంలో ఆయన మిగతా వ్యాసకర్తలు అందరికంటే విఖ్యాతుడు. అక్టోబర్ విప్లవ పూర్వపు రష్యాలో జన్మించిన బెర్లిన్ చిన్నవయసులోనే తన తల్లిదండ్రులతో ఇంగ్లాండ్‌కు వలస వచ్చాడు. తనవైన చింతనా పద్ధతుల్లో బ్రిటిష్ మేథో సంస్కృతికి వారసుడుగా వెలుగొందారు. ఆక్స్‌ఫర్డ్‌లో ఆచార్యుడుగా సుప్రసిద్ధమయ్యాడు. ఒక కొత్త ఆక్స్‌ఫర్డ్ కళాశాలను కూడా నెలకొల్పాడు. బ్రిటిష్ అకాడెమీకి అధ్యక్షుడు అయ్యాడు. ముమ్మూర్తులా బ్రిటిష్‌వాడుగా రూపొందినప్పటికీ రష్యా చరిత్రలో తన ప్రగాఢ కుతూహలాన్ని, గత కాలం రష్యన్ రచయితలు, చింతకుల పట్ల అపురూపమైన ఆసక్తిని తుదకంటా నిలుపుకున్న యూరోపియన్ మేధావి. రష్యాలో కమ్యూనిస్టుల పాలన అణచివేసిన పాతకాలం బుద్ధిజీవుల మేథో కృషి, ఉదారవాద సంప్రదాయాల పునరుద్ధరణకు 1989 ఘటనలు అవకాశం కల్పించాయని బెర్లిన్ పేర్కొన్నారు. తూర్పు యూరప్‌లో సోవియట్ కీలుబొమ్మల ప్రభుత్వాలు కూలిపోవడాన్ని మిగతా వ్యాసకర్తలూ స్వాగతించారు. అయితే భవిష్యత్తు పట్ల నిండు ఆశాభావాన్ని వ్యక్తం చేయలేదు, పలు సంవత్సరాలుగా కెనడాలో నివసిస్తున్న చెక్ రచయిత జొసెఫ్ స్కెవోరెస్కీ ఇలా రాశారు: 'ఐరోపాలోని వివిధ దేశాలలో నిరంకుశ ప్రభుత్వాలకు రోజులు చెల్లిపోయాయి. మరికొన్ని దేశాలలో వాటి అంతం ఆరంభమయింది'. బహుముఖ ప్రజ్ఞాశాలి జార్జి స్టెయినెర్ ఇలా వ్యాఖ్యానించాడు: మనం ప్రతిచోటా పునరుజ్జీవ జాతీయవాదం, జాతి విద్వేషాల మధ్య ఒక ఉన్మాద పోటీని చూస్తున్నాము. అయితే అమెరికా మాత్రం ఒక ప్రాంతీయ మహాశక్తిగా పరిణమిస్తున్నట్టుగా కనిపిస్తోంది. యూరప్ గురించి తెలుసుకోవడం లేదు. సంభవిస్తున్న సంఘటనలను పట్టించుకోకుండా ఈ మహా గొప్ప పాత ప్రపంచం (యూరప్) పట్ల ఉదాసీనత చూపుతున్నది. ఏమైనా యూరప్ పునరుత్థానమవుతోంది. తన సొంతంగా నిలబడుతోంది'. 1989 సంఘటనలలో సంభవించినదేమిటి? తూర్పు యూరప్ అంతటా అణచివేతకు గురైన జాతీయవాద మనోభావాలు ఉప్పెనలా వ్యక్తమయ్యాయి. పోలిష్ ప్రజలు, చెక్ దేశ వాసులు, మగ్యార్లు, జర్మన్లు సోవియట్ యూనియన్ ఆధిపత్యంపై తిరుగుబాటు చేశారు. సోవియట్ రష్యా శృంఖలాల నుంచి విముక్తమయ్యేందుకు దృఢంగా సంకల్పించుకున్నారు. పర్యవసానమే కొత్త యూరప్ ఆవిర్భావం. తూర్పు యూరప్ లోని చిన్న చిన్న దేశాలు మళ్లీ స్వేచ్ఛ సాధించుకోవడం పట్ల పలువురు వ్యాసకర్తలు తమ దృష్టి కేంద్రీకరించగా అంద్రేయి సిన్యావస్కీ అనే వ్యాసకర్త మాత్రం జాతీయవాదం అణగారిన ప్రజలను విముక్తం చేయడమే కాకుండా ప్రతి ఘాతుక శక్తిగా కూడా పరిణమించగలదని హెచ్చరించారు. 'ప్రతిఘాతుక శక్తి' అనే వ్యాఖ్యను ఆయన రష్యాను దృష్టిలో ఉంచుకుని చేశారు. ఒక ఇతివృత్తంతో వెలువరించే ఏ సంచిక కోసమైనా సంబంధిత పత్రిక ఎడిటర్ వ్యాసకర్తలకు వేర్వేరుగా లేఖలు రాయడం పరిపాటి. ???బెర్లిన్, సాన్యావస్కీలు ఇద్దరికీ తోటి వ్యాసకర్త ఏమి చెప్పుతున్నాడన్న విషయం తెలిసి ఉండే అవకాశం లేదు. ప్రచురితమైన మూడు దశాబ్దాల అనంతరం వారి వ్యాసాలను వెంటవెంటనే చదువుతున్నప్పుడు ఒకరి ఆశాభావం, మరొకరి సంశయవాదం మధ్య వైరుధ్యం స్పష్టంగా కన్పించింది. ఇందుకు కారణం వారి జీవిత ప్రస్థానాలు భిన్న రీతులలో సాగడమేనని చెప్పవచ్చు. రష్యాలో రష్యన్లతో నేరుగా సంబంధాలు లేని తాత్త్వికుడు బెర్లిన్. రష్యన్లతో ప్రత్యక్ష అనుభవాలు అపారంగా ఉన్న మేధావి సిన్యావస్కీ. 1925లో





మాస్కోలో జన్మించిన సిన్యావస్కీ, 1973లో మాత్రమే సోవియట్ యూనియన్ నుంచి వలస పోయిన వ్యక్తి. కనుక ఆయనకు రష్యన్లతో దశాబ్దాల పాటు ప్రత్యక్ష అనుభవాలు ఉన్నాయి. రష్యన్ జాతీయవాదంలో విదేశీయుల పట్ల ద్వేషం దురహంకార ధోరణులు ఎలా ఉంటాయో ఆయనకు బాగా తెలిసి ఉంటుంది. తమ మాతృభూమి రష్యా విషయంలో మాత్రం బెర్లిన్ అభిప్రాయాల కంటే సిన్యావస్కీ అభిప్రాయాలే నిర్దుష్టంగా, యథార్థంగా ఉన్నాయని చెప్పవచ్చు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న వ్లాదిమిర్ పుతిన్ తొలుత తన సొంత ప్రజలను తన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా దాస్యులను చేసుకోగలిగాడు. ఆ తరువాత, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైపోయిన తరువాత స్వేచ్ఛ పొందిన దేశాల ప్రజలపై రష్యా సంపూర్ణ పెత్తనాన్ని నెలకొల్పేందుకు పూనుకున్నాడు. పుతిన్‌లో బలంగా ఉన్న సామ్రాజ్య పునర్నిర్మాణ ఆకాంక్షే ఉక్రెయిన్ దురాక్రమణగా రూపుదాల్చింది. ఉక్రెయిన్‌ను జయించిన పిదప మరికొన్ని చిన్న యూరోపియన్ దేశాలను సైతం ఆక్రమించుకునేందుకు ఆయన తప్పక ప్రయత్నిస్తాడు. రష్యన్ జాతీయవాద దురహంకార ధోరణులను, పుతిన్ విస్తరణవాదాన్ని విమర్శిస్తున్నవారు రష్యా భీతితో వ్యవహరిస్తున్నవారుగా పుతిన్ సమర్థకులు కొట్టివేస్తున్నారు. అమెరికా భవిష్యత్తులో యూరప్ పట్ల పూర్తిగా ఉదాసీనత చూపుతుందని జార్జి స్టెయినర్ చేసిన వ్యాఖ్యలు చాల దూరదృష్టితో చేసినవని గత పక్షం రోజులుగా సంభవిస్తున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. అమెరికా కాలక్రమేణా ఐరోపాపట్ల పూర్తిగా ఉదాసీనత చూపుతుందనేది ఆయన వ్యాఖ్యల సారాంశం కదా. పుతిన్ పట్ల డొనాల్డ్ ట్రంప్ అభిమానం అందరికీ తెలిసిందే అయినా, రెండోసారి అధికారానికి వచ్చీ రాగానే ఉక్రెయిన్ విషయంలో తీవ్ర వ్యతిరేకతతో వ్యవహరిస్తాడని కొద్ది మంది మాత్రమే ఊహించారు. ఫిబ్రవరి 28న వైట్ హౌజ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని ట్రంప్, ఆయన ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ మీడియా ముందే అంతగా అవమానించడాన్ని రష్యన్ రాజకీయవేత్తలు సహజంగానే స్వాగతించారు. ఉక్రెయిన్‌ను మళ్లీ స్వాధీనం చేసుకోవాలన్న తమ ఆకాంక్షను ట్రంప్ సమర్థిస్తున్నట్టు ఆ ఘటన నిర్ధారించిందని వారు ఆనందపడుతున్నారు. అయితే యుద్ధంతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌కు సహాయపడడానికి తాము తిరస్కరించినప్పటికీ యూరోపియన్ మిత్ర రాజ్యాలు ఆ దేశానికి వెన్వెంటనే పూర్తి మద్దతునిస్తాయన్న విషయాన్ని ట్రంప్ ఊహించలేకపోయారు. వైట్‌హౌజ్‌లో మాటల యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారమయిన వెన్వెంటనే యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల, భద్రతా విధాన ప్రతినిధి కజా కల్లాస్ సామాజిక మాధ్యమాల్లో తన ప్రతిస్పందనను పోస్ట్ చేశారు: 'ఉక్రెయిన్ ఐరోపాకు అన్య దేశం కాదు. దురాక్రమణదారుకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ల పోరాటానికి అవసరమైన మద్దతును పూర్తిగా అందిస్తాం'. ఆమె ఇంకా ఇలా పేర్కొన్నారు: 'స్వేచ్ఛాయుత ప్రపంచానికి ఒక కొత్త నాయకుడు అవసరమని ఈ రోజు స్పష్టమయింది. ఈ సవాల్‌ను యూరోపియన్లమైన మేము సమర్థంగా ఎదుర్కొంటాము'. యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల ప్రతినిధి బాధ్యతలు చేపట్టక ముందుకు కల్లాస్ ఎస్టోనియా ప్రధానమంత్రిగా ఉన్నారు. సోవియట్ యూనియన్ ఆధిపత్యం నుంచి విముక్తి పొందిన చిన్న బాల్టిక్ రాజ్యాలలో ఎస్టోనియా ఒకటి. ఉక్రెయిన్‌ను వశపరచుకున్న తరువాత పుతిన్ దృష్టి తమ దేశంపై తప్పక పడుతుందన్న వాస్తవం ఆమెకు బాగా తెలుసు. కల్లాస్ ధిక్కార ధోరణి కంటే బ్రిటిష్ ప్రధాని కెయిర్ స్టార్మర్ తెలిపిన సంఘీభావం చాలా ముఖ్యమైనది. జెలెన్ స్కీని తన అధికార నివాసానికి ఆహ్వానించి వైట్‌హౌజ్ఆయనకునిరాకరించిన గౌరవాదరాల నివ్వడమేకాకుండా ఉక్రెయిన్‌కు గణనీయమైన ఆర్థిక, ఆయుధ సహాయాన్ని బ్రిటిష్ ప్రధాని ప్రకటించడం గమనార్హం.

# త్రిభాష విధానంపై అనవసర రాద్దాంతం : మంత్రి లోకేష్

**అమరావతి, మార్చి 11:** దేశ వ్యాప్తంగా త్రిభాషా విధానాన్ని అమల్లోకి తీసుకు వచ్చేందుకు కేంద్రం వడి వడిగా అడుగులు వేస్తుంది. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తనదైన శైలిలో స్పందించారు. స్పందిస్తున్నారు కూడా. దీంతో కేంద్రం వర్సెస్ తమిళనాడు రాష్ట్రం అన్నట్లుగా పరిస్థితి మారింది. అలాంటి వేళ.. ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. మంగళవారం అమరావతిలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. మాతృభాష అంశంపై పొరుగు రాష్ట్రాలు అనవసర రాజకీయం చేస్తున్నాయని పేర్కొన్నారు. మాతృభాషను కాపాడుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కానీ కావాలని కొందరు దీనిని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం జర్మనీ, జపనీస్ భాషలు.. మన విద్యార్థులు నేర్చుకొంటున్నారని గుర్తు చేశారు. అలాంటి వేళ.. త్రిభాషా విధానం ఎలా తప్పవుతోందని మంత్రి నారా లోకేష్ ప్రశ్నించారు. దేశంలో త్రిభాషా విధానం అమలు చేసే దిశగా కేంద్రం ప్రయత్నాలు చేపట్టింది. అయితే ఈ విధానం వల్ల మాతృభాషకు మరుగున



పడే అవకాశముందని తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా..దీనిని అడ్డుకునేందుకు ఆయన తన వంతు ప్రయత్నాలు చేపట్టారు. ఆందులోభాగంగా తమిళనాడుకు చెందిన ఎంపీ పార్లమెంట్‌లో నల్ల టీ షర్ట్ ధరించి.. తన నిరసన తెలియజేశారు. ఇక హిందీ భాషను తమపై బలవంతంగా రుద్దితే సహించబోమని ఇప్పటికే తమిళనాడులోని పార్టీలన్నీ ఏకమైన స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. తాము ద్వి భాష విధానానికే కట్టుబడి ఉంటామని సదరు పార్టీలు ప్రకటించాయి. ఇంకోవైపు పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 10వ తేదీన ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా పలు అంశాలపై పార్లమెంట్‌ను ప్రతిపక్షాలు స్తంభింప చేస్తున్నాయి. వాటిలో త్రి భాషా విధానం ఒకటన్న సంగతి అందరికి తెలిసిందే. అయితే దేశంలోని వివిధ ప్రాంతాల్లో యువత.. విదేశీ భాషలను నేర్చుకునేందుకు తీవ్ర ఆసక్తి కనబరుస్తోంది. ఆ క్రమంలో జపాన్, జర్మనీ, స్పానిష్ తదితర భాషలను నేర్చుకుంటున్నారు. అలాంటి వారి సంఖ్య తెలుగు రాష్ట్రాల్లో సైతం అధికంగానే ఉంది. అలాంటి వేళ.. ఏపీ విద్య శాఖ మంత్రి నారా లోకేష్ పై విధంగా స్పందించారు.

## లొంగిపో..బోరుగడ్డకు హై కోర్ట్ వార్నింగ్

అమరావతి: రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌కు ఏపీ హైకోర్టు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. అవసరమైతే.. చెన్నై నుంచి ఫ్లైట్‌లో రాజమండ్రి వచ్చి సెంట్రల్ జైలులో లొంగిపోవాలని ఆదేశించింది. మరోసారి మధ్యంతర బెయిల్ పొడిగించేది లేదని స్పష్టం చేసింది. ఈ రోజుతో బోరుగడ్డ మధ్యంతర బెయిల్ గడువు ముగిసింది. రాజమండ్రి జైలులో లొంగిపోకుండా మధ్యంతర బెయిల్ పొడిగించాలంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో కోర్టు పైవిధంగా స్పందించింది.

## జమ్మూకశ్మీర్‌లోని రెండు సంస్థలను నిషేధించిన కేంద్రం




**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్ కేంద్రంగా పనిచేస్తున్న రెండు సంస్థలపై కేంద్ర హెూం శాఖ కొరడా ఝులిపించింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఆ రెండు సంస్థలపై ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తున్నట్టు వేర్వేరు ప్రకటనల్లో తెలిపింది. అవామీ యాక్షన్ కమిటీ జమ్మూకశ్మీర్ ఇత్తిహాదుల్ ముస్లిమీన్ సంస్థలను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద నిషేధిత సంస్థలుగా ప్రకటిస్తున్నట్టు పేర్కొంది. అవామీ యాక్షన్ కమిటీకి ఉమర్ ఫరూక్ సారథ్యం వహిస్తుండగా, జేకేఐఎంకు మసూర్ అబ్బాస్ సారథ్యం వహిస్తున్నారు. ఏఏసీ, జేకేఐఎంలు జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ భారత వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నాయని ఎంహెచ్ఏ అధికారిక ప్రకటనలో పేర్కొంది. సాయుధ చొరబాట్లు, అంశాంతి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అశాంతి రెచ్చగొడుతున్నట్టు తెలిపింది. జాతి వ్యతిరేక ప్రసంగాల చేయడం, హింసను ప్రేరేపించడం, రాళ్లు రువ్వడం వంటి ఘనటనల్లో ఉమర్ ఫరూక్, ఇతర సభ్యుల ప్రేమయంపై అనేక కేసులు నమోదుకావడాన్ని ప్రస్తావించింది. మసూర్ అబ్బాస్ నేతృత్వంలోని జేకేఐఎం జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ, భారత వ్యత్రిరేక ప్రచారం, ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తోందని తెలిపింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల కోసం ఆ సంస్థ సభ్యులు నిధులు సేకరిస్తున్నటు పేర్కొంది. ఆయా కారణాల దృష్ట్యా 1967 చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద రెండు సంస్థలపైన ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తున్నట్టు ఎంహెచ్ఏ స్పష్టం చేసింది.

## లాలూ తనయుడు తేజ్‌ప్రతాప్, కుమార్తె హేమకు బెయిల్

న్యూఢిల్లీ: స్థలాలు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారనే కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజ్ ప్రతాప్, కుమార్తె హేమ యాదవ్, తదితరులకు రౌస్ ఎవెన్యూ కోర్టు మంగళవారంనాడు బెయిలు మంజూరు చేసింది. ఈ కేసులో సమన్లు జారీ కావడంతో తేజ్ ప్రతాప్, హేమ యాదవ్ కోర్టుకు హాజరయ్యారు. దీంతో వీరికి కోర్టు రూ.50,000 పూచీకత్తు, అంతే మొత్తానికి ష్యూరిటీతో కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఇదే కేసులో లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవి, మిసాభారతి హాజరు కావాల్సి ఉండగా, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ వీరు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కేసులో తుది ఛార్జిషీట్లుతో సహా మూడు చార్జిషీట్లను సీబీఐ దాఖలుచేసింది. ఇందులో లాలూ ప్రసాద్, మరో 77 మందిని నిందితులుగా పేర్కొంది. ఈ ఛార్జిషీట్లను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గాగ్నే.. తేజ్ ప్రతాప్, హేమయాదవ్ తదితరులకు బెయిలు మంజూరు చేస్తూ, తదుపరి విచారణను మార్చి 20వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసు లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న 2004 నుంచి 2009 మధ్య కాలానికి సంబంధించినది. ఆయన హయాంలో నిబంధనలను పట్టించుకోకుండా రైల్వే గ్రూప్ డీ పోస్టుల్లో కొందరికి ఉద్యోగాలు ఇప్పించారని ఆరోపణలున్నాయి. అందుకు ప్రతిగా లాలూ కుటుంబ సభ్యులు, ఇతర అనుచరుల పేరిట భూములను రిజిస్టర్ చేయించున్నారని సమాచారం. ఈ కేసులో క్రిమినల్ కోణంలో సీబీఐ దర్యాప్తు చేస్తుండగా, మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. దీంతో ఈ రెండు దర్యాప్తు సంస్థలు లాలూ కుటుంబ సభ్యులను పలుమార్లు విచారించాయి.

## ముదిరిన వాణిజ్య యుద్ధం..

### కెనడా దిగుమతులపై సుంకాన్ని పెంచిన ట్రంప్

**వాషింగ్టన్ :** కెనడాతో ఢీ అంటే ఢీ అంటున్న ట్రంప్ మరోసారి సుంకాల కొరడా ఝుళిపించారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులు అన్నింటిపైనా సుంకాన్ని 50 శాతానికి పెంచేందుకు నిర్ణయించారు. అమెరికాకు ఎగుమతి చేసే విద్యుత్‌పై కెనడా 25 శాతం సుంకాన్ని విధించిన నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం ఈ విషయాన్ని తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో వెల్లడించారు. పెంచిన సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి వస్తాయని అన్నారు. "అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా బాగమైతేనే మంచిది. దీంతో, సుంకాలన్నీ తొలగిపోతాయి. అంతా మాయవుతాయి" అని ట్రంప్ కామెంట్ చేశారు. కెనడా దిగుమతులపై సుంకాలు పెంచడం, అమెరికాలో భాగం కావాలంటూ పలుమార్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ కోరడంతో వివాదం మొదలైన విషయం తెలిసిందే. కెనడాతో వాణిజ్యంలో సమతౌల్యం పేరిట ఇప్పటికే అమెరికా విధించిన పలు సుంకాలు గతం వారం నుంచి అమల్లోకి వచ్చాయి.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101